రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేస్తాం


కేంద్ర మంత్రిని సన్మానిస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ తదితరులు

సుల్తాన్‌బజార్: రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేస్తామని కేంద్ర మంత్రి సంజయ్ సేత్ అన్నారు. శనివారం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ కేంద్ర మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ..దేశంలో బీజేపీ ప్రభుత్వ హయాంలోనే డిఫెన్స్ వ్యవస్థ బలోపేతం అయ్యిందన్నారు. సంజయ్ సేత్ డిఫెన్స్ రంగంలో ఎంతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో భారత్ గొప్ప దేశంగా ఉండబోతుందన్నారు.

లాల్‌దర్వాజా ఆలయ పనులకు శ్రీకారం


ఆలయ రంగులను ప్రారంభిస్తున్న చైర్మన్ మారుతీ యాదవ్

చాంద్రాయణగుట్ట: వచ్చే నెలలో జరుగనున్న లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయ బోనాల ఉత్సవాలకు సంబంధించి ముస్తాబు పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. ఆలయానికి రంగులు వేసేందుకు కమిటీ చైర్మన్ బి.మారుతీ యాదవ్ పర్యవేక్షణలో సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి రామకృష్ణ శర్మ, మాజీ చైర్మన్లు కె.విష్ణు గౌడ్, కె.వెంకటేష్, శీరా రాజ్‌కుమార్, కోశాధికారి ఎ.చంద్రకుమార్, ప్రచార కార్యదర్శి యశ్వంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మేకల మండిలో జోరుగా విక్రయాలు



జియాగూడ: జియాగూడ మేకల మండిలో మేకలు, పొట్టేళ్ల విక్రయాలు జోరుగా కొనసాగాయి. పండుగను పురస్కరించుకొని ధరలు పెరిగాయి. 10 కేజీల బరువు తూగేవి రూ.14 వేలు పలికాయి. శుక్రవారం దేశంలోని పలు రాష్ట్రాల నుంచి సుమారు రూ.5 లక్షల గొర్రె పొట్టేళ్లు, మేకలు మండిలో దిగుమతి కాగా శనివారం మధ్యాహ్నం వరకు కూడా విక్రయాలు జరిగాయి. ఖుర్బానీ కోసం తెప్పించిన గొర్రె పొట్టేళ్లు, మేకలు 10 కేజీల నుంచి 50 కేజీల వరకు అందుబాటులో లభించాయి. దీంతో జియాగూడ మేకల మండి రహదారులు రద్దీతో కిక్కిరిసిపోయాయి.

కేటీఆర్‌కు స్వాగతం


కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: విదేశీ పర్యటన ముగించుకొని నగరానికి వచ్చిన మాజీ మంత్రి కేటీఆర్‌కు గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ స్వాగతం పలికారు. శనివారం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లి కేటీఆర్‌కు స్వాగతం చెప్పారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చే రోజులు సమీపంలో ఉన్నాయన్నారు.

ఉద్యోగులకు అండగా టీఎన్జీఓస్


ముజీబ్ హుస్సేన్‌ను సత్కరిస్తున్న కేఆర్.రాజ్‌కుమార్, పర్వతాలు తదితరులు

అబిడ్స్: ఉద్యోగులకు అండగా టీఎన్జీఓ యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని టీఎన్జీఓస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. శనివారం టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ అసోసియేట్ ప్రెసిడెంట్ కేఆర్.రాజ్‌కుమార్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ పర్వతాలు ఆధ్వర్యంలో ఎస్ఎం.ముజీబ్ హుస్సేన్‌ను సత్కరించి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైదిక్ శాస్త్రి, సత్యనారాయణ, భాస్కర్, సుదర్శన్, శ్రీనివాస్ బాబు, శివ, బాలాజీ, పురుషోత్తమ్, బంగారయ్య, శివరాజ్, హన్మంతు, మహేష్ గౌడ్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్లతో అవస్థలు

- కార్వాన్‌లో గుంతలమయంగా మారిన రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు
- బోనాల ఉత్సవాల వరకు రోడ్లకు మరమ్మతులు చేయాలి డిమాండ్

జియాగూడ: కార్వాన్‌లోని 8 బస్తీల్లో రోడ్లు అధ్వానంగా మారింది. పలు చోట్ల ధ్వంసం, పలు చోట్ల గుంతలు, ఇటీవల సీవరేజ్, వాటర్ వర్క్స్, తదితర అభివృద్ధి పనులు పూర్తి చేసినా రోడ్డు మరమ్మతులు చేయకపోవడంతో రహదారిల్లో వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. ముఖ్యంగా కేసరి హనుమాన్‌నగర్, మరాఠి గల్లీ, ఆంధ్రుని కార్వాన్, శివాజీనగర్, మార్కండేయ నగర్, జైన్ గల్లీ హనుమాన్ స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో రోడ్డు పూర్తిగా ధ్వంసమయ్యింది.

40 ఏళ్ల క్రితం వేసిన రోడ్లు..

కార్వాన్‌లోని 8 బస్తీల్లో సీసీ రోడ్లు సుమారు 40 ఏళ్ల క్రితం వేసినవి క్రమేణా పెరిగిన జనాభాకు అనుగుణగా ఇటీవల సీవరేజ్, వాటర్ వర్క్స్‌ల పైపులైన్ పనులను చేపట్టి పూర్తి చేశారు. అనంతరం రోడ్డు నూతనంగా వేయడం మరిచారు. కనీసం రోడ్డు మరమ్మతులు చేసిన పాపాన జీహెచ్ఎంసీ పోలేదని స్థానిక బస్తీలవాసులు, వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఆంధ్రున్ కార్వాన్‌లో గుంతలమయంగా రోడ్డు

జోనల్ కమిషనర్‌కి వినతి..

కార్వాన్ ప్రాంతాల్లో మాతేశ్వరీ ఆలయాలు అధికంగా ఉన్నాయని బోనాల వేడుకల నాటికి రోడ్ల నిర్మాణం, మరమ్మతులు చేపట్టాలని కార్వాన్ శివ శంకర క్రాంతి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఖైరతాబాద్‌లోని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతిని కలిసి వినతి పత్రం సమర్పించినట్లు సమితి అధ్యక్షుడు అనంత కృష్ణ తెలిపారు. ఇక్కడే దర్బార్ మైసమ్మ ఆలయం, తుల్జా భవానీ మందిరం, పోచమ్మ గుడి తదితర ఆలయాలకు బోనాల పండుగ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకుని ఆలయాలకు వచ్చే రోడ్డు గుంతల వల్ల పడే ప్రమాదం ఉందన్నారు.


బీటలు వారిన కార్వాన్ షాహుకారి రోడ్డు

రోడ్లకు మరమ్మతులు చేయాలి..



అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసిన అధికారులు మరమ్మతులు చేపట్టలేదు. దీంతో బస్తీల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. బోనాల వేడుకల నాటికి కార్వాన్ బస్తీలలో రోడ్లకు మరమ్మతులు చేయాలి.
– పదాల అనంత కృష్ణ, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు

నేడు చేప ప్రసాదం పంపిణీ

అబిడ్స్: చేప ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం ఉదయం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేప ప్రసాదం పంపిణీ ప్రారంభం కానుంది. నగర ఇన్‌చార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో కలిసి చేపప్రసాదం పంపిణీ ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నారు. పోలీస్, జీహెచ్ఎంసీ, ఆర్ అండ్‌బీ, విద్యుత్, మత్స్యశాఖ, రెవెన్యూ, ఆర్టీసీ వాటర్‌బోర్డు, ఇతర పలు శాఖల అధికారులు తమ తమ ఏర్పాట్లు చేపట్టారు.

42 కౌంటర్లలో చేప ప్రసాదం..

42 కౌంటర్ల ద్వారా చేప ప్రసాదం పంపిణీ చేపడుతున్నట్లు ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ తెలిపారు. శనివారం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో బత్తిని కుటుంబీకులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..1.50 లక్షల చేప పిల్లలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అదేవిధంగా ఆస్తమా రోగుల సౌకర్యార్థం వాటర్‌బోర్డు ఆధ్వర్యంలో 5 లక్షల తాగునీటి వాటర్ ప్యాకెట్లను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. 13 క్యూ లైన్లలో ఆస్తమా రోగులు వెళ్లే విధంగా బారికేడ్లు నిర్మించినట్లు ఆయన వివరించారు.


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మెట్టు సాయికుమార్, బత్తిని కుటుంబీకులు

డీసీపీ పర్యవేక్షణ..

శనివారం రాత్రి సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి, అడిషనల్ డీసీపీ ఆనంద్ చేప ప్రసాదం పంపిణీ బందోబస్తును పర్యవేక్షించారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లోపల పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సీసీ కెమెరాల ద్వారా ఏర్పాట్ల పరిస్థితులను సమీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ..దాదాపు 800 మంది పోలీసులతో ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ నలుమూలలా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.


ఉచిత ఆహార పదార్థాల పంపిణీ


అన్నదానంలో పాల్గొన్న డాక్టర్ నాగ్‌నాథ్ మాశెట్టి, కల్వ మల్లికార్జునప్ప

చార్మినార్: ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగే చేప ప్రసాదం కోసం వచ్చే ప్రజలకు టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ నాగ్‌నాథ్ మాశెట్టి ఆధ్వర్యంలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఉచితంగా ఆహార పదార్థాలను అందజేశారు. పంపిణీకి ముందు బసవేశ్వరుని చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దూర ప్రాంతాల నుంచి ఒకరోజు ముందుగానే నగరానికి చేరుకున్న ప్రజల సౌకర్యార్థం టీ, టిఫిన్‌లతో పాటు భోజనాలు, తాగునీరు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం పాలక మండలి మాజీ సభ్యులు, బసవ సంక్షేమ సమితి అధ్యక్షుడు కల్వ మల్లికార్జునప్ప, బీజేపీ సీనియర్ నాయకుడు గోవింద్ రాఠీ, ప్రతినిధులు దినేష్ పట్నే, నాగ్‌రాజ్ శీల్వంత్, అశోక్ మాశెట్టి, రమేష్ సోలాపురే, బాబు మాశెట్టి, ప్రశాంత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బద్రి విశాల్ ఆధ్వర్యంలో...

అబిడ్స్: చేప ప్రసాదం కోసం ఎగ్జిబిషన్‌కు వచ్చిన వేలాది మందికి అల్పాహారాలు, భోజనాలు పంపిణీ చేశారు. శనివారం పలు రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన ఆస్తమా రోగులు, వారి సహాయకులకు బద్రివిశాల్ స్వచ్ఛంద సంస్థ, అగర్వాల్ సంస్థ, ఆర్యవైశ్య సంఘం లాంటి పలు స్వచ్ఛంద సంస్థలు అల్పాహారాలు, భోజనాలు, తాగునీరు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు శంకర్‌లల్ యాదవ్, వీహెచ్‌పీ గ్రేటర్ నాయకుడు వీరేశం మాట్లాడుతూ..పలు రాష్ట్రాల నుంచి వచ్చే వారి కోసం భోజన వసతితో పాటు ఇతర వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు.


అల్పాహారం పంపిణీ చేస్తున్న శంకర్‌లాల్ యాదవ్, వీరేశం



కుతుబ్‌షాహీ ఈద్గాలో మాట్లాడుతున్న కారీ మతీన్ అలీషా, హాజరైన ముస్లింలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్

అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో శనివారం బక్రీద్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈద్గాలు, మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా ప్రాంతాలకు చెందిన హిందువులు, ముస్లింలను ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ తెలిపారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.
– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం


సయ్యద్ హమీదుద్దీన్‌కు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న గాజుల అంజయ్య


మక్కా మసీదు వద్ద..


శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

ఉద్యోగులకు డీఏ ప్రకటనపై హర్షం

నాంపల్లి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డీఏలతో పాటు ఆరోగ్య కార్డులు, పెండింగ్ బిల్స్ కోసం ప్రతినెలా రూ.700 కోట్లు కేటాయించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంపై తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాగంటి సోమయ్య ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, క్యాబినెట్ సబ్ కమిటీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు, మంత్రులు శ్రీధర్ బాబుకు, పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహాకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఓబీసీలను బలోపేతం చేయాలి


ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న ఆనంద్ గౌడ్, సందీప్‌కుమార్ తదితరులు

సుల్తాన్‌బజార్: రాష్ట్రంలో ఓబీసీలను బలోపేతం చేయాలని బీజేపీ ఓబీసీ శాఖ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆనంద్ గౌడ్, సందీప్ లాల డిమాండ్ చేశారు. శనివారం త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్రంలో ఓబీసీ సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ఓబీసీలు ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వాలు ఓబీసీల సంక్షేమం కోసం పాటుపడాలని కోరారు. రానున్న రోజుల్లో ఓబీసీలకు సముచిత స్థానం కల్పించేలా తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

2 వేల టన్నుల యానిమల్ వేస్టేజ్ తరలింపు


వెంకన్న

చార్మినార్: బక్రీద్ సందర్భంగా ఏర్పడిన యానిమల్ వేస్టేజ్‌ను ఎప్పటికప్పుడు తొలగించడానికి గ్రేటర్ కమిషనర్ ఆదేశాల మేరకు చార్మినార్ జోన్ పరిధిలో ప్రత్యేక ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను ఏర్పాటు చేసి పర్యవేక్షించామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న తెలిపారు. శనివారం చార్మినార్‌లో ఆయన చెత్త తరలింపు పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇమ్లిబన్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద నుంచి యానిమల్ వేస్టేజ్‌తో కూడిన చెత్తను తరలించామన్నారు. అలాగే బండ్లగూడ, మీరాలం ట్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ల ద్వారా ఎప్పటికప్పుడు చెత్తను తరలించామన్నారు. చార్మినార్ జోన్ పరిధిలో మొత్తం 250 వాహనాలను వినియోగించి 2 వేల టన్నుల చెత్తను తరలించి పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. 300 మంది అదనపు సిబ్బందిని వినియోగించామన్నారు.

స్వీట్, బ్రెడ్‌లకు గిరాకీ



గోల్కొండ: బక్రీద్ రోజున ముస్లింలు డబుల్ కా మీటాను తయారు చేస్తారు. డబుల్ కా మీటాకు అవసరమయ్యే బ్రెడ్ అమ్మకాలు జోరుగాసాగుతాయి. మెహిదీపట్నం, టోలిచౌకీ, గోల్కొండ తదితర ప్రాంతాల్లోని బేకరీల వారు ప్రత్యేకంగా డబుల్ కా మీటాకు అవసరమైయ్యే బ్రెడ్‌లను తయారు చేసి అమ్ముతున్నారు. అదే విధంగా గులాబీ పూరేకులు సైతం బాగా అమ్ముడుపోయాయి. బక్రీద్ ప్రార్థనల అనంతరం ముస్లింలు శ్మశానవాటికలను సందర్శిస్తారు. మృతిచెందిన తమ కుటుంబ సభ్యుల సమాధుల వద్ద గులాబీ పూరేకులు ఉంచి నివాళులర్పిస్తారు.

నాటక రంగాన్ని కాపాడుకోవాలి



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శుద్రాక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎక్స్‌ప్రెషన్-3 పేరిట నిర్వహిస్తున్న బహుభాషా జాతీయ థియేటర్ ఫెస్టివల్ శనివారం రవీంద్రభారతిలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ..నాటక రంగాన్ని కాపాడుకోవాలన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన నాటక సమూహాలను ఒకే వేదికపై ప్రదర్శించడం ఎంతో అభినందనీయమన్నారు. మూడురోజుల పాటు ఈ నాటకోత్సవాలు జరుగుతాయని తెలపారు. అనంతరం తెలంగాణకు చెందిన ఒగ్గుకథ, పశ్చిమ బెంగాల్‌కు చెందిన మతీర్ జొన్నో నాటకాలను ప్రదర్శించారు.

చేప ప్రసాదం పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు


పూజలో పాల్గొన్న మెట్టు సాయికుమార్ తదితరులు

చార్మినార్: చేప ప్రసాదం పంపిణీకి ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేసిందని తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. శనివారం దూద్‌బౌలిలోని బత్తిని నివాసంలో నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతానికి బత్తిని కుటుంబసభ్యులు, వారి సన్నిహితులతో పాటు మెట్టు సాయి కుమార్, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. వారికి బత్తిని గౌరీ శంకర్ గౌడ్ స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ..ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించే ఉచిత చేప ప్రసాదం పంపిణీ భగవంతుని ఆశీర్వాదంతో సజావుగా కొనసాగాలని కోరుకున్నానన్నారు. ఈ ఏడాది కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక ప్రణాళికను రూపొందించినట్లు వెల్లడించారు.

పేరిణి నృత్య కళను కాపాడుకోవాలి


చిన్నారులతో మామిడి హరికృష్ణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో అంతరించిపోతున్న పేరిణి నృత్య కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ మణిద్వీప ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో పేరిణి నృత్యంపై నిర్వహించిన 40 రోజుల ఉచిత వేసవి శిక్షణా శిబిరం ముగింపు వేడుకలను శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన 100 మంది విద్యార్థులు వివిధ అంశాలపై చేసిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం శిక్షణ పొందిన చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేరిణి నృత్యం తెలంగాణతో పాటు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కోట్ల హన్మంతరావు, అకాడమీ గురువు పేరిణి సందీప్, డాక్టర్ పృథ్వీరాజ్, డాక్టర్ అనురాధదేవి తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లిలో 'బడిబాట'



బడిబాట ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు

నాంపల్లి: చాదర్‌ఘాట్-2 బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చిరాగ్‌అలీ ప్రాథమిక పాఠశాలల సంయుక్త నిర్వహణలో 'బడిబాట'కార్యక్రమాన్ని చేపట్టారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.మంగారెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాగంటి సోమయ్య నేతృత్వంలో నాంపల్లిలోని ఆండాలమ్మ బస్తీతో పాటుగా పలు మురికివాడల్లో బడిబాట ర్యాలీ నిర్వహించారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పాలని ఉపాధ్యాయులు కోరారు. అనంతరం బడిబాట ప్రతిజ్ఞ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ రేణుకతో పాటుగా పాఠశాల సిబ్బంది నర్సింగరావు, సిసిల్ క్రిస్టినా, సదానంద్, పాండు, పి.శ్రీనివాస్, గీత, సుధా, లక్ష్మణ్, చరిత పాల్గొన్నారు.

ఈటల రాజేందర్‌కు ఆహ్వానం


ఈటల రాజేందర్‌కు ఆహ్వానపత్రం అందజేస్తున్న సాయిబాబాచారి, శ్రీకాంత్‌చారి తదితరులు

గోల్కొండ: బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడతాయని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఈ నెల 26న గోల్కొండ బోనాల సందర్భంగా రిసాలబజార్ నుంచి తాము అమ్మవారికి పూజలు కోసం ఊరేగింపు నిర్వహిస్తున్నామని దీనికి రావాలని గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని వారి సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి ఆయనకు ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బోనాలకు గత ప్రభుత్వం ప్రభుత్వ పండుగగా ప్రకటించి చేతులు దులుపుకుందన్నారు. ప్రజల అభిరుచులకు తగ్గట్లుగా బోనాలు నిర్వహించడంలో గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పూర్తిగా విఫలమైయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సేవా సమితి అధ్యక్షులు బి.శ్రీకాంత్, మహంకాళి ఆలయ పూజారి బి.సురేష్‌చారి, మల్లేష్‌చారి, జగదీష్ తదితరులున్నారు.

సన్మానం


సత్యనారాయణను సన్మానిస్తున్న నాయకులు

గోల్కొండ: షేక్‌పేట్‌కి ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ కృషి చేస్తున్నారని డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన షేక్‌పేట్‌లోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలోని శివాలయం స్లాబ్ పనులను పరిశీలించారు. త్వరలోనే ఈ ఆలయ పనులు పూర్తి అవుతాయన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సి.నర్సింగ్‌రావు, సీహెచ్ మల్లేష్, జి.శివకుమార్ తదితరులు ఆయనను సత్కరించారు.

బక్రీద్‌కు జీహెచ్ఎంసీ, పోలీసుల సేవలు భేష్


అలీ మస్కతి

చార్మినార్: బక్రీద్‌కు పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది అందించిన సేవలు భేష్ అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అలీ మస్కతి అన్నారు. పాతబస్తీలోని ముస్లింలకు పార్టీ సీనియర్ నాయకులకు ఆయన బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు నగరంలో బక్రీద్ పండుగకు పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగలేదన్నారు. సంబంధిత సిబ్బంది ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకున్నారన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బందితో కలిసి స్థానిక పోలీసులు సమన్వయంతో వ్యవహరించడంతో పాతబస్తీలోని అన్ని ప్రాంతాల్లోని వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోలేదన్నారు. పోలీసులు నిరంతరం నిఘా కొనసాగించడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదన్నారు.